ప్రేక్షకరంజకం పాండవోద్యోగం నాటకం

చిక్కడపల్లి: ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పద్య నాటకోత్సవాలలో భాగంగా మంగళవారం త్యాగరాయ గానసభలో పాండవోద్యోగం నాటక ప్రదర్శన ప్రేక్షకరంజకంగా సాగింది. కళాకారులు పాత్రోచితంగా నటించి ప్రదర్శనను రక్తికట్టించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం ముఖ్యఅతిథిగా హాజరై కళాకారులను అభినందించి సన్మానించారు. సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రఘుశ్రీ, లోకం కృష్ణయ్య, ఉమర్ అలీఖాన్, మోహనకృష్ణ, కుందుర్తి వెంకటకృష్ణ, నారాయణస్వామి, స్వాహ్వాచారి, మల్లాది వెంకటరమణ, లింగమయ్య, రామమోహనరావు, ఓంకార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

అంబర్‌పేట: మౌలిక సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయరాదని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని నందనవనం కాలనీలో ఆమె అధికారులతో కలిసి ప్రజా సమస్యలపై పర్యటించారు. కాలనీలో వర్షపునీరు, దోమలు, పారిశుద్ధ్యం వంటి సమస్యలు ప్రధానం ఎదుర్కొంటున్నట్లు కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని తక్షణమే పరిష్కరించేదుకు చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు.

అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

అంబర్‌పేట: ప్రతిష్టాత్మకమైన జేఈఈ అడ్వాన్స్ పరీక్షా ఫలితాల్లో శ్రీచైతన్య డీడీకాలనీ శాఖ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. దీంతో మంగళవారం కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది సంబురాలు చేసుకున్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించి అభినందించారు. 6 మందికి వేయిలోపు ర్యాంకులు రావడంతో అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ శ్రీవణీరెడ్డి, ఏజీఎంలు సతీష్, అంకిరెడ్డి, అసోసియేట్ డీన్‌లు ఉదయ్‌కిరణ్, మణికంఠ, ప్రిన్సిపాల్‌లు సుజాత, నరసింహ, వల్లీ మాధవి, బాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



ముషీరాబాద్: మాజీ మంత్రి హరీష్‌రావును విమర్శించే నైతిక అర్హత పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు లేదని బీఆర్ఎస్ నేత నాగేష్‌ముదిరాజ్ అన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు జన్మదినం సందర్భంగా రాంనగర్ చౌరస్తాలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. లాటరీ పద్ధతిలో పీసీసీ అధ్యక్షుడైన మహేష్‌గౌడ్ ఆయన స్థాయిని మరిచి విమర్శలు చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద వేల ఎకరాలు సాగులోకి వచ్చాయని కాంగ్రెస్ నాయకులే ఒప్పుకుంటున్నారని అన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం రాంనగర్ కూరగాయల మార్కెట్ వీధిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహ్మద్ అబేద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదానం మహాదానం అని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుండాలని సూచించారు. ప్రజలకు సేవ చేసినప్పుడే సమాజంలో గుర్తింపు, ఆదరణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగేష్‌ముదిరాజ్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శివముదిరాజ్, ఆకుల అరుణ్‌కుమార్, జెల్ల భిక్షపతి పాల్గొన్నారు.



పార్కులో ఏర్పాటు చేసిన గజబ్



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు

హృద్యానవనం.!

ఆహ్లాదాన్ని పంచుతున్న న్యూనల్లకుంట నరేంద్ర పార్క్ ● పచ్చదనానికి, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్న కమిటీ

నల్లకుంట: అక్కడికి వెళ్తే పచ్చని మొక్కలు ఒక వైపు.. పెద్దల కోసం షటిల్ కోర్టు, చిన్నారులు ఆడుకునేందుకు క్రీడా పరికరాలు మరో వైపు స్వాగతం పలుకుతాయి. సాయంత్ర సమయాన వృద్ధులు, చిన్నారులు సేద తీరేందుకు ఏర్పాటు చేసిన పార్కు ఆహ్లాదాన్ని పంచడమే కాకుండా పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతతో సందర్శకులను కట్టిపడేస్తోంది. స్థానికుల ప్యారడైజ్‌గా పిలుచుకునే న్యూ నల్లకుంటలోని నరేంద్ర పార్క్ కాలనీ వాసులకు, న్యూ నల్లకుంట పరిసరాల వాసులకు ఆహ్లాదాన్ని పంచుతోంది.



న్యూ నల్లకుంటలోని నరేంద్ర పార్క్

పచ్చదనం ఉట్టిపడే పార్కు ఇదే..

2023 జనరల్ ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహకారంతో జీహెచ్ఎంసీ అధికారులు పార్కులో సుందరీకరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రీనర్(లాన్), వాకింగ్ ట్రాక్, గజబ్, పూల మొక్కలు, పిల్లల కోసం జారుడు బల్లలు, ఊయలలు తదితర ఆట పరికరాల ఏర్పాటు, పెద్దల కోసం షటిల్ కోర్టును ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్ ఇరువైపులా పచ్చని మొక్కలు నాటారు. వ్యాయామం చేసిన తర్వాత పిచ్చాపాటిగా కబుర్లు చెప్పుకునేందుకు వీలుగా సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు.

వీకెండ్‌లో ఉల్లాసంగా చిన్నారులు..

పార్కులో సందర్శకులు ఎవరూ వ్యర్థాలు, పేపర్లు వేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పార్కులో మొక్కలకు నీరు. సంరక్షణ చేసుకునేందుకు తోటమాలిని, కాపలా కాసేందుకు వాచ్‌మెన్‌ను నియమించుకున్నారు. పార్కు చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోకుండా ఉండేందుకు ఫుట్‌పాత్ కూడా నిర్మించారు. చిన్నారులు శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో పార్కులో ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఆడుకుంటున్నారు.





పచ్చిక బయళ్లతో ఆకట్టుకుంటున్న పార్క్



పార్కులో ఏర్పాటు చేసిన బెంచీలు

పార్కు ఆకర్షణీయంగా ఉంది



న్యూనల్లకుంటలోని నరేంద్ర పార్కు చాలా ఆకర్షణీయంగా ఉంది. నియోజకవర్గంలో చాలా పార్కులు ఉన్నప్పటికీ నరేంద్ర పార్కు పచ్చిక బయళ్లు, పూల మొక్కలు, పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలతో చాలా బాగుంది. నేను ఏడేళ్లుగా ఈ పార్కులో వాకింగ్‌కు వస్తున్నాను. పెద్దలు ప్రకృతి ఒడిలో వాకింగ్ చేయడానికి ఏర్పాటు చేసిన ట్రాక్ చాలా బాగుంది. – రవీందర్, వాకర్

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి..



నరేంద్ర పార్కు పిల్లలకే కాకుండా పెద్దలకు సైతం చాలా బాగుంది. ముఖ్యంగా షటిల్ కోర్టు, యోగా కోసం గ్రౌండ్ ఉంది. నేను ప్రతి రోజు ఉదయం షటిల్ ఆడుకోవడానికి వస్తుంటాను. ఇక్కడ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మూడు బ్యాచ్‌లలో షటిల్స్ ఆడుకుంటారు. సందర్శకుల కోసం ప్యూరీఫైడ్ వాటర్ అందుబాటులో ఉంచారు. పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయిస్తే స్థానిక యువతకు ఎంతగానో ఉపయోగకరంగా బాగుంటుంది. – హుస్సేన్, షటిల్స్ ప్లేయర్

సమష్టిగా పార్కు నిర్వహణ..



పార్కు నిర్వహణను కాలనీ వాసులు అందరూ సమష్టిగా చూసుకుంటున్నాం. సార్వత్రిక ఎన్నికలు ముందు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించి పార్కులో సుందరీకరణ పనులు చేపట్టారు. ఇందులో ముఖ్యంగా లాన్, చిన్నపిల్లల కోసం ఆట పరికరాలు, పెద్దలు సేద తీరేందుకు గజబ్ ఏర్పాటు చేయించారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. – రాజేందర్, పార్కు కమిటీ అధ్యక్షుడు

ప్రత్యేక ప్రణాళికతో పైప్‌లైన్ల పునరుద్ధరణ



డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలో సీవరేజీ, డ్రైనేజీ పైప్‌లైన్‌లో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక ప్రణాళికతో నూతన పైప్‌లైన్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. మంగళంవారం శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డులోని బాలాజీ మిఠాయి షాప్ పక్క లేన్‌లో నూతనంగా చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. అదే సమయంలో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు మల్లిపూడి గోపాలం, సాదినేని నవీన్, రాజేశ్వర్, బ్రహ్మచారి, శ్రీకాంత్, రామకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఎంబీ. కిషోర్‌కుమార్, ధర్మేందర్, నవీన్, రమణా నాయుడు, జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, జలమండలి విజ్ఞానపురి సెక్షన్ మేనేజర్ వెంకటేష్, ఇన్‌స్పెక్టర్ గురునాథ్‌రావు, వర్క్ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

కవాడిగూడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. కవాడిగూడ డివిజన్‌కు చెందిన 159మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం వారు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... కల్యాణలక్ష్మి పథకంతో అనేక మంది పేదలకు లబ్ధి చేకూరుతోందని అన్నారు. ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాంధీనగర్ కార్పొరేటర్ పావని, ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్, మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్, నాయకులు శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, పోతరాజు భాస్కర్, కొండ శ్రీధర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బక్రీద్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి

ముషీరాబాద్: ముస్లింలు పవిత్రంగా జరుపుకునే బక్రీద్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని భోలక్‌పూర్ మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్ కోరారు. మంగళవారం జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ రామానుజులరెడ్డిని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో ముస్లింలు అధికంగా ఉన్నారని అన్నారు. బక్రీద్ సందర్భంగా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జంతు వ్యర్థాలను ఎత్తివేయడానికి 25వేల ప్లాస్టిక్ బ్యాగులు, మూడు జేసీబీ వాహనాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేందుకు అదనంగా 25 చెత్త లారీలను ఏర్పాటు చేయాలన్నారు. చెత్తకుండీల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్

రాష్ట్ర పునర్‌నిర్మాణంలో భాగస్వాములు కావాలి



టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నేతలు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నేతలు నాగభూషణం, యాదగిరిగౌడ్, కృష్ణగౌడ్ మంగళవారం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పార్టీ కార్యకర్తలు వారధిగా నిలవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకం త్వరలో ప్రారంభం అవుతుందన్నారు.

22న బ్రాహ్మణ మెగా వివాహ పరిచయ వేదిక

నల్లకుంట: అఖిల బ్రాహ్మణ సమాజాభివృద్ధి సంస్థ(ఏబీసీడీ) స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 22న శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి కల్యాణం, రాష్ట్ర స్థాయి ఉచిత బ్రాహ్మణ మెగా వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎస్ సుబ్రమణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూనల్లకుంట కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ కమ్యూనిటీహాల్‌లో ఉదయం ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. పరిచయ వేదిక అనంతరం సంస్థ సర్వసభ్య సమావేశం ఉంటుందని తెలిపారు. వివాహ పరిచయ వేదికలో పాల్గొనాలనే ఆసక్తి కలిగిన వారు ఈనెల 10వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రేమ విఫలమై రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కాచిగూడ: ప్రేమ విఫలమై ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్, పెద్దగొల్లపల్లికి చెందిన మల్లేష్ కుమారుడు కొత్తపల్లి మహేష్ కుమార్ (27) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రేమ విఫలమై జీవితంపై విరక్తిచెంది అతను ఉందానగర్-జూకల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

కాచిగూడ: గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని హోటల్ ఎదుట గుర్తుతెలియని వృద్ధుడు (60) మృతదేహాన్ని గుర్తించి ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుల బ్యాగుల చోరీ

కాచిగూడ: రెండు వేర్వేరు రైళ్లలో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళా ప్రయాణికుల హ్యాండ్ బ్యాగులను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... జీడిమెట్లలో నివాసం ఉంటున్న వినయ్ సేతియ భార్యతో కలిసి కాచిగూడకు రావడానికి బెంగళూర్‌లో అశోకపురం ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. అనంతపురం రైల్వే స్టేషన్ సమీపంలో తన భార్య హ్యాండ్ బ్యాగులను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బ్యాగులో సెల్‌ఫోన్, ఏటీఎం కార్డు, ఆధార్ కార్డు, రూ.500 నగదు ఉంది. మరో ఘటనలో మంజుదేవి కాచిగూడకు రావడానికి మహారాష్ట్రలోని జూలురు రైల్వే స్టేషన్‌లో కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. నాందేడ్ వద్ద ఆమె హ్యాండ్ బ్యాగును దొంగలు ఎత్తుకెళ్లారు. బ్యాగులో సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు, రూ.5,500 నగదు ఉంది. వినయ్ సేతియా ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి అనంతపురం రైల్వే పోలీస్ స్టేషన్‌కు, మంజు దేవి ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆదేశాలున్నా నామమాత్రంగా కూల్చివేతలు

టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

కవాడిగూడ: డివిజన్ పరిధిలోని అరవింద్‌నగర్ కాలనీలో హైకోర్టు ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం అనుమతిలేని అంతస్తులను కూల్చివేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు జరిగిన ఈ కూల్చివేతలను తూతూమాత్రంగా జరిపి టౌన్‌ప్లానింగ్ అధికారులు చేతులు దులుపుకున్నారు. ఐదేళ్ల క్రితం నిర్మించిన ఇంటికి ప్లస్-2 అనుమతి ఉండగా మరో రెండు అంతస్తులతో పాటు టెంట్‌హౌస్‌ను అక్రమంగా నిర్మించారు. అయితే నిర్మాణంపై గతంలో స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోలేదు. దీంతో స్థానికంగా ఉండే మనోహరమ్మ భవన నిర్మాణ అధికారుల పనితీరుపై హైకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు అనుమతిలేని అంతస్తులను కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గం సర్కిల్-15 టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ తన సిబ్బందితో దోమలగూడ పోలీసుల బందోబస్తు నడుమ పాక్షికంగా ధ్వంసం చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరుపై స్థానికులు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అక్రమంగా నిర్మించిన అంతస్తును పాక్షికంగా ధ్వంసం చేయించిన అధికారులు

రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చర్యలు చేపట్టండి



విద్యానగర్‌లో పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ముషీరాబాద్: వర్షాకాలం నేపథ్యంలో బస్తీలు, కాలనీలలో ప్రధాన రహదారుల ఇరువైపులా చెత్త, మట్టి కుప్పలు లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యల చేపట్టాలని ముషీరాబాద్ సర్కిల్ అధికారులకు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆదేశించారు. మంగళవారం ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణల ఆధ్వర్యంలో అడిక్‌మెట్ డివిజన్‌లోని జేడీబీ గార్డెన్, దయానంద్‌నగర్, నాగమయ్యకుంట, విద్యానగర్ ప్రాంతాలలో జరిగిన మట్టి, చెత్త కుప్పల తొలగింపు స్పెషల్ డ్రైవ్‌ను వారు పరిశీలించి మాట్లాడారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రతి డివిజన్‌లో మూడు రోజుల పాటు చెత్త, మట్టి ఇతర వ్యర్థాలను రోడ్ల పక్కన లేకుండా చూస్తామన్నారు. దీని వల్ల వర్షం పడితే వర్షపునీరు సాఫీగా వెళ్తుందన్నారు. నాలాల్లో కూడా నీరు నిలువ ఉండకుండా సాఫీగా వెళ్తుందన్నారు. ప్రజలు రోడ్లపై చెత్తను వేయొద్దని కోరారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ గోవర్ధన్, శ్రీనివాస్, అంజద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా రిస్కీ ఆపరేషన్



ఆపరేషన్ చేస్తున్న వైద్య బృందం

అంబర్‌పేట: పేద మహిళకు క్లిష్టమైన ఆపరేషన్ చేసి ఆమె కుటుంబానికి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు ఎంతో అండగా నిలిచారు. పెద్దాస్పత్రిలో చేయాల్సిన ఆపరేషన్‌ను అంబర్‌పేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దక్షాయణి చొరవ తీసుకుని ఓ మహిళకు గర్భసంచి ఆపరేషన్ చేసి ప్రాణం పోసారు. వివరాల్లోకి వెళితే గోల్నాకకు చెందిన చెన్నమ్మ, భర్త నాగరాజు దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కాగా చెన్నమ్మ గర్భసంచి సమస్యతో బాధపడుతూ పెద్ద ఆస్పత్రిలో సంప్రదించగా రూ.లక్షకు పైగా ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో స్థానిక ఆశావర్కర్ల సహకారంతో అంబర్‌పేటలో ఉన్న ఏరియా ఆస్పత్రిలో సంప్రదించారు. పరీక్షించిన డాక్టర్ దక్షాయణి చొరవ తీసుకుని చెన్నమ్మకు మంగళవారం విజయవంతంగా గర్భసంచి ఆపరేషన్‌ను చేశారు. ఇలాంటి ఆపరేషన్‌ను సాధారణంగా గాంధీ, ఉస్మానియా వంటి ఆస్పత్రుల్లో చేస్తారన్నారు. కాగా రోగి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని చొరవ తీసుకుని ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

ఏఐ టూల్స్ నేర్చుకుని విద్యార్థులకు బోధించాలి

కాచిగూడ: రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో మంగళవారం 'ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ టూల్స్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్‌ను నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ప్రో-వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థులందరూ ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్నారని అన్నారు. వారికి బోధించడానికి అధ్యాపకులందరూ ఏఐ టూల్స్‌ను నేర్చుకోవాలని సూచించారు. ఏఐ సహాయంతో వీడియోలను తయారు చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచితే తరగతులకు హాజరు కాలేని విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం తమ కళాశాలలో నిర్వహించే కార్యక్రమాలన్నీ ఏఐ సంబంధించినవే ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సి.కవిత, కళాశాల సెక్రటరీ ప్రొ. సుదర్శన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ సింధూరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి